


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 26-5-2025

సంపుటి: 21 సంచిక: 53
పేజీలు: 8 వెల: రూ.1

# పరిపారేస్తున్నారు..!


- పోలీసుల అదుపులో ఓబీఎస్
- కళ్లేపల్లిలో కానిస్టేబుల్‌ను తోసేసిన రౌడీషీటర్
- పేకాట, బెట్టింగ్‌లకు యాప్‌ను సృష్టించిన మనోళ్లు





పేకాట, క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్న పొన్నాడకు చెందిన పాకల కిశోర్, ఒప్పంగికి చెందిన రవితేజలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొద్ది రోజుల క్రితం పట్టుకోవడం ద్వారా జిల్లాలో బెట్టింగ్, పేకాటతో పాటు గంజాయి రవాణాకు సంబంధించిన ఒక పెద్ద సిండికేట్ గుట్టును రట్టు చేయనున్నారు. ఒప్పంగిలో ఒకర్ని, పొన్నాడలో ఒకర్ని అదుపులోకి తీసుకొని విచారించిన తర్వాత వారి ఫోన్ డేటా ఆధారంగా తీగ లాగితే డొంకంతా కదిలింది. అందులో భాగంగానే జిల్లాలో ఎవరెవరు పేకాడిస్తున్నారు? బెట్టింగుకు పాల్పడుతున్నవారెవరు? ఈ సిండికేట్‌లో ఎంతమంది ఉన్నారు? సొమ్ములు ఎక్కడి నుంచి ఎక్కడికి చేతులు మారుతున్నాయి? అన్న కూపీ లాగారు. అందులో భాగంగానే శ్రీకాకుళం నగర పరిసర ప్రాంతాల్లో వరుసగా రౌడీషీటర్లకు కౌన్సిలింగ్‌లు, బుకీలను అదుపులోకి తీసుకోవడం వంటి చర్యలు రెండు రోజులుగా ఊపందుకున్నాయి.





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టౌన్‌లో రెండు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు రోజుల పాటు రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు తాజాగా సోమవారం కూడా రౌడీషీటర్లను స్టేషన్‌కు రమ్మన్నారు. పోలీసులంటే లెక్కలేనితనం పెరిగిపోయిందన్న భావన స్వయంగా - మిగతా చివరి పేజీలో

# విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతి



- తీవ్ర గాయాలతో ఇద్దరు ఆసుపత్రి పాలు
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు

(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

కంచిలి మండలం తలతంపర పంచాయతీ చిల్లిపుట్టుగ గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురై సోమవారం ఉదయం ముగ్గురు మృతిచెందారు. స్థానికులు చెప్పిన సమాచారం మేరకు.. గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ వైర్లు తెగిపడి విద్యుత్ ఘాతానికి గురై ముగ్గరు మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మొదట నోలియా కాళిదాస్(4) విద్యుత్ ఘాతకానికి గురై మృతిచెందాడు. బాలుడిని రక్షించడానికి వెళ్లిన బల్లెడ నందిని విద్యుత్ షాక్‌కు గురై అసువుల బాసింది. వీరిద్దర్ని కాపాడే ప్రయత్నించిన చిల్లా ఈశ్వరరావు (32) విద్యుత్ ఘాతానికి గురై ఘటన స్థలంలోని మృతి చెందాడు. వీరితో పాటు పొడియా మనోజ్‌తో పాటు మరొకరు విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలతో కంచిలి ఆసుపత్రిలో చేరారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విద్యుత్ ఘాతానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కంచిలి ఎస్ఐ పారినాయుడు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**మంత్రి దిగ్భ్రాంతి:** విద్యుత్ ఘాతానికి గురై ముగ్గురు మృతిచెందిన ఘటనపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు కడప నుంచి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కంచిలి వైద్యులకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు మంత్రి అచ్చెన్నాయుడు ప్రగాఢ సానుభూతి తెలిపారు.





# కడ చూపైనా దక్కేలా లేదే!

- మావోయిస్ట్ అగ్రనేత నంబాల ఉదంతంలో ఉత్కంఠ
- హైకోర్టు ఆదేశించినా మృతదేహం అప్పగించని పోలీసులు
- కుంటి సాకులతో కాలయాపన చేస్తున్నారని ఆరోపణలు
- ఎడతెగని ప్రయత్నాల్లో కుటుంబ సభ్యులు
- స్వగ్రామం జియన్నపేట ఎదురుచూపులు

డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి

**ఏం ఇబ్బంది లేదు.. నారాయణపూర్ పోలీసుల వద్దకు వెళితే.. మృతదేహం అప్పగిస్తారని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ ప్రతినిధి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు చెప్పారు.**

**కానీ అక్కడికి వెళితే మీరు శ్రీకాకుళం పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నారా? మృతుడు మీ కుటుంబ సభ్యుడేననడానికి ఆధారాలేమిటి? అన్న ప్రశ్నలతో అక్కడి పోలీసులు మృతదేహం ఇవ్వకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు.**

ఇదీ ఇటీవలి ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావు మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు వెళ్లిన కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులకు ఎదురైన అనుభవం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఒత్తిడితోనే ఛత్తీస్‌గఢ్ సర్కారు నంబాలతో సహా ముగ్గురు తెలుగు మాయిస్టుల మృతదేహాల అప్పగింతలో అనుచిత జాప్యం చేస్తోందని వారు ఆరోపిస్తున్నారు. దీంతో నంబాల మృతదేహాన్ని చివరిసారి స్వగ్రామానికి తీసుకురావాలని, అక్కడే అంతిమ వీడ్కోలు పలకాలని ఆశపడిన కుటుంబ సభ్యులు, కోటబొమ్మాళి మండలం జియన్నపేట గ్రామస్తులకు నిరాశ తప్పడంలేదు. వాస్తవానికి రాష్ట్ర హైకోర్టు తీర్పుతో నంబాల మృతదేహాన్ని తీసుకొచ్చి సోమవారం తుది నివాళులు అర్పించి అంతియ సంస్కారాలు చేయాలని భావించారు. కానీ పోలీసుల తీరుతో అసలు మృతదేహాన్ని అప్పగిస్తారా? అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

### హైకోర్టుకు ఏజీ హామీ


బీబీసీ, ఇతర ప్రముఖ మీడియా సంస్థలకు నంబాల సోదరులు ఢిల్లేశ్వరరావు, రాంప్రసాద్ అలాగే ఆదివారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఏపీ అధికార ప్రతినిధి పి.ప్రసాద్ చెప్పిన వివరాల ప్రకారం ఎన్‌కౌంటర్ జరిగిన నాటి నుంచి ఆదివారం రాత్రి వరకు జరిగిన పరిణామాలు ఇలా ఉన్నాయి. ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో ఈ నెల 21న మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు హతమయ్యారు. హతుల్లో సీపీఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి, సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు కూడా ఉన్నారు. విప్లవ ఉద్యమంలో చేరి నాలుగు దశాబ్దాలకుపైగా కుటుంబానికి, స్వగ్రామానికి దూరంగా అజ్ఞాత జీవితం గడిపిన నంబాల కేశవరావు మరణవార్త తెలిసి స్వగ్రామం జియన్నపేటతో పాటు శ్రీకాకుళం జిల్లా మొత్తం ఉలిక్కిపడింది. నంబాల మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి ఆయన కుటుంబ సభ్యులు అదే రోజు బయల్దేరి వెళ్లారు. అయితే వారిని జగదల్‌పూర్‌లోనే ఛత్తీస్‌గఢ్ పోలీసులు కలిసి మృతదేహం ఇచ్చే అవకాశం లేదని, అక్కడి నుంచే వెనక్కి వెళ్లిపోవాలని తేల్చి చెప్పేశారు. దాంతో వెనక్కి వచ్చిన కుటుంబ సభ్యులు ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ సందర్భంగా మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి అయినందున నారాయణపూర్ వెళ్లి పోలీసులను కలిస్తే మృతదేహాలు అప్పగిస్తారని, అందులో అభ్యంతరం లేదని ఛత్తీస్‌గఢ్ అడ్వొకేట్ జనరల్ హైకోర్టుకు విన్నవించారు. ఆ మేరకు మృతదేహాలు అప్పగించాలని పోలీసులను ఆదేశిస్తూ, నారాయణపూర్ వెళ్లాలని పిటిషనర్లకు సూచిస్తూ హైకోర్టు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.



జగదల్‌పూర్‌లో కుటుంబ సభ్యుల మృతదేహాల కోసం ఎదురుచూస్తున్న దృశ్యం (ఫొటో బీబీసీ సౌజన్యంతో..)

### భిన్నంగా పోలీసుల వైఖరి

కోర్టు ఉత్తర్వుల ప్రకారం నంబాల కుటుంబ సభ్యులు మళ్లీ నారాయణపూర్‌కు వెళ్లగా.. ఇక్కడ జియన్నపేటలో ఆయన అంత్యక్రియల ఏర్పాట్లలో బంధువులు నిమగ్నమయ్యారు. కానీ హైకోర్టులో అడ్వొకేట్ జనరల్ చెప్పిన దానికి విరుద్ధంగా నారాయణపూర్ పోలీసులు వ్యవహరించారు. నంబాల మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్తే స్థూపాల నిర్మాణం, నివాళులర్పించడం వంటివి జరిగి మళ్లీ శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉన్నందున స్థానిక పోలీసుల నుంచి అభ్యంతరం లేదంటూ అనుమతి తీసుకున్నారా? అసలు నంబాల మీ కుటుంబ సభ్యుడేనని నిర్ధారించడానికి రుజువులేమిటి? అని అనేక ప్రశ్నలు సంధిస్తూ మృతదేహం ఇవ్వడానికి తిరస్కరించారు. హైకోర్టు ఆదేశాలను చూపించినా వారు ఏమాత్రం ఖాతరు చేయలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. రెండు రోజులుగా ఆస్పత్రి, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా ఎవరూ స్పందించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. చనిపోయినవారికి చివరి కర్మలు చేయడం సంస్కారం, సంప్రదాయమని, గతంలో మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యులు, ఇతర ముఖ్యులు మరణించిన సందర్భాల్లో వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కానీ ఇప్పుడు మాత్రం నంబాల మృతదేహం అప్పగింతకు ససేమిరా అంటున్నారని, ఇది సహజ హక్కుల ఉల్లంఘన అని వ్యాఖ్యానించారు.



నంబాల కేశవరావు సోదరుడు రామ్‌ప్రసాద్ పరిస్థితిని ఫోన్‌లో కుటుంబ సభ్యులకు వివరిస్తున్న దృశ్యం. (ఫొటో బీబీసీ సౌజన్యంతో..)

### బస్తర్ ఐజీ వివరణ

ఈ వివాదంపై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ స్పందిస్తూ నిర్దేశిత న్యాయ ప్రక్రియలను పూర్తిగా అనుసరించాల్సి ఉందన్నారు. ఎన్‌కౌంటర్ తర్వాత మృతదేహాల గుర్తింపు, న్యాయ విచారణ, పోస్టుమార్టం వంటి న్యాయపరమైన ప్రక్రియలన్నీ పూర్తయ్యాక, మరణించిన వారి హక్కుదారుల్ని గుర్తించిన తర్వాతే మృతదేహాలను వారికి అప్పగిస్తామని బీబీసీకి చెప్పారు.




## అవమానించిన చోట నుంచే

# అప్రతిహత యాత్ర

### సైకిళ్లు ఇచ్చి ర్యాలీ చేయించిన కలిశెట్టి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు అరెస్టయినప్పుడు ఆయన విడుదల కోరుతూ ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి నలుగురు యువకులు కుప్పం వరకు సైకిల్ యాత్ర నిర్వహించారు. సరిగ్గా అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నియోజకవర్గం పుంగనూరులో ప్రవేశించగానే స్థానిక వైకాపా నేతలు వీరి చొక్కాలు విప్పించి అవమానించి వెనక్కు పంపారు. ఇప్పుడు అదే నలుగురు యువకులకు నాలుగు సైకిళ్లు ఇచ్చి పుంగనూరు నుంచే కడపలో నిర్వహించే మహానాడుకు అప్రతిహతంగా యాత్ర నిర్వహించేందుకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పూనుకొన్నారు. తన నియోజకవర్గానికి చెందిన ఈ నలుగుర్ని పుంగనూరు పంపించి, అక్కడి నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా కడపలో మహానాడు వేదిక వద్దకు చేరుకునే ఏర్పాట్లు చేశారు. వీరికి పుంగనూరు నుంచి ఇద్దరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం అపూర్వ స్వాగతం పలికి, అట్టహాసంగా యాత్రను ప్రారంభించారు.



• ఎడిటోరియల్

# కాంగ్రెస్‌కు షర్మిలే సమస్య అవుతున్నారా?

అసలే అంతంత మాత్రంగా ఉన్న రాష్ట్ర కాంగ్రెస్‌ను ఉద్దీపింపజేస్తారన్న ఆశలు రేపిన వైఎస్ షర్మిలే.. ఇప్పుడే ఆ పార్టీని కొత్త కష్టాల్లోకి నెట్టేస్తున్నారు. పార్టీలో ఇప్పుడిదే హాట్ టాపిక్‌గా మారింది. అందరినీ కలుపుకొని పోకుండా షర్మిల సొంత అజెండా అమలు చేస్తుండటంతో పార్టీలో సీనియర్లు ఆమె పట్ల గుర్రుగా ఉన్నారు. కొందరు దాన్ని బహిరంగంగానే వ్యక్తపరుస్తున్నారు. ఫలితంగా ఆమె ఎక్కడ ఏ కార్యక్రమం తలపెట్టినా పెద్దగా స్పందన ఉండటం లేదు. సీనియర్ నాయకులూ ఆమె వెంట నడవడంలేదు. ఇదే అంశాన్ని పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్కం ఠాగూర్ రాష్ట్ర నేతలతో నిర్వహించిన ఫోన్ కాల్ భేటీలో ప్రస్తావిస్తూ అందరినీ కలుపుకొని పార్టీని ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చెప్పారట! పార్టీ నేతలెవరూ తనకు సహకరించడంలేదని ఈ సందర్భంగా షర్మిల ఫిర్యాదు చేయగా.. కొందరు సీనియర్ నేతలు తామె చేసిన ఫిర్యాదులను మాణిక్కం ఠాగూర్ ఆమె ముందు పెట్టారు. ఎవరు ఏం చెప్పినా పట్టించుకోవడంలేదని కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు చేస్తున్నట్లు పలువురు పేర్కొన్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. వ్యక్తిగత అజెండాలతో పార్టీ ఎదుగుదల ఉండదని కూడా తేల్చి చెప్పిన ఆయన మార్పు రాకపోతే పార్టీ ఎప్పటికీ ఇలానే ఉంటుందని హెచ్చరించినట్లు చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు తీసుకున్న వైఎస్ షర్మిల షుప్తాచేతనావస్థలో ఉన్న పార్టీలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. దాంతో పార్టీకి కాస్తా ఊపు వచ్చిన మాట నిజం. సార్వత్రిక ఎన్నికల్లోనూ పార్టీ ఓట్ల శాతం పెరిగి పార్టీ క్యాడర్‌లో కొత్త ఆశలు చిగురించాయి. ఇలాగే కష్టపడితే మరో పదేళ్లకైనా పార్టీ అధికారంలోకి వస్తుందని నేతలు భావించారు. కానీ ఈలోపే సీను మారిపోయి పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. షర్మిల తీరును ఎండగడుతూ కొందరు బయటకెళ్లిపోవడం, మరికొందరు నేతలు రచ్చకెక్కడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా షర్మిలపై కొందరు కాంగ్రెస్ నేతలు తిరుగుబాటు చేశారు. విశాఖలోని ఓ హోటల్‌లో వివిధ జిల్లాల సీనియర్ కాంగ్రెస్ నాయకులు సమావేశమయ్యారు. వీరంతా షర్మిలను వ్యతిరేకిస్తున్నవారే కావడం గమనార్హం. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ ఈ సమావేశానికి చొరవ తీసుకున్నట్లు చెబుతున్నారు. షర్మిల స్వార్థపూరిత, అహంకార ధోరణి రాజకీయాలతో విసిగిపోయామని వారు ప్రకటించారు. కష్టకాలంలోనూ పార్టీ జెండా వదలని నికార్సయిన కాంగ్రెస్ వాదులు షర్మిలను అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని ఆ సమావేశం ద్వారా హైకమాండ్‌ను డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలో చేరే అవకాశం ఉన్నా దాన్ని కాదనుకుని వైకాపా నుంచి తిరిగి తన సొంత పార్టీ అయిన కాంగ్రెస్‌లో చేరిన కృపారాణికి షర్మిల నుంచి తిరస్కారాలు ఎదురవుడంతో ఆమె అసంతృప్తితో ఉన్నారు. ఇక షర్మిలకు సొంత జిల్లా కడపకు చెందిన నేతే షాకిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపాను వీడి కడప నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన అఫ్జల్ ఖాన్ ప్రస్తుతం కడప నగర పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. షర్మిల తీరుతోనే విసిగిపోయి ఇటీవల పార్టీని వీడారని ప్రచారం ఉంది. అంతకుముందు ఏపీసీసీ మాజీ చీఫ్ శైలజనాథ్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. ఆయన కూడా షర్మిల తీరును తట్టుకోలేక పార్టీని వీడారని అప్పట్లో వార్తలు వచ్చాయి. అనంతపురం జిల్లాకు చెందిన శైలజానాథ్ 2004లో వైఎస్ఆర్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 2009లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత రాజకీయంగా సైలెంట్ అయ్యారు. ఆ తర్వాత రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన తర్వాతే తెలంగాణలో రాజకీయాలు చేస్తున్న షర్మిల ఏపీకి తీసుకొచ్చి మరీ రాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలు కట్టబెట్టారు. కొన్నాళ్లు మౌనంగా ఉన్న శైలజానాథ్ ఇటీవలే కాంగ్రెస్‌ను వీడి వైకాపాలో జాయిన్ అయ్యారు. రాష్ట్రం కోలుకుంటున్న సమయంలోనే సొంత పార్టీ లీడర్లు వరుసగా గుడ్‌బై చెప్పడం హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పుడు పలువురు సీనియర్ నేతలు సమావేశాలు నిర్వహించి అసంతృప్తి వ్యక్తం చేయడానికి షర్మిల తీరే కారణమని చెప్పాలి. ఆమె ఒంటెద్దు పోకడల కారణంగానే ఉన్న కొద్దిమంది సీనియర్ నేతలు కూడా పార్టీకి దూరం అవుతున్నారని కార్యకర్తల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని అధిష్టానం గుర్తించి తక్షణమే చక్కదిద్దకపోతే కాంగ్రెస్ పరిస్థితి మరింత దిగజారిపోయే ప్రమాదం ఉంది.

## కాకాణి అరెస్ట్ దౌర్జన్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



వైకాపా నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేయడాన్ని జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణ దాస్ తీవ్రంగా ఖండించారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రజలకు వాగ్దానాలు ఇచ్చిన చంద్రబాబు అవి అమలు చేయలేక ఇప్పుడు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెగపడ్డారన్నారు. రెడ్‌బుక్, రాజ్యాంగం పేరుతో వైకాపాను లక్ష్యంగా చేసుకుని అరెస్టుల పర్వం ప్రారంభించారన్నారు. తమ పార్టీకి చెందిన వందల మంది నాయకులు, కార్యకర్తలను అవాస్తవ కేసులతో జైలుకు పంపిస్తున్నారన్నారు. ఇంత దారుణమైన పాలనను రాష్ట్రం ఎన్నడూ చూడలేదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు సర్కారు ఒకటే లక్ష్యంతో పనిచేస్తోందని, అది ప్రతిపక్షంపై కక్షసాధింపులు చేయడం అని ధర్మాన విమర్శించారు. "సూపర్ సిక్స్ పథకాల గురించి మాటేమీ లేనట్టే, కానీ వైకాపా కార్యకర్తలపై అణచివేత చర్యలు మాత్రం గరిష్ఠ స్థాయిలో ఉన్నాయన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదని, వారికే అనుకూలంగా వ్యవస్థలను వాడుకుంటున్నారు. వ్యక్తిగత కక్షలతో అరెస్టులు చేయడం దారుణమన్నారు. ప్రజలు ఈ నిరంకుశ పాలనను గమనిస్తున్నారన్నారు.

## లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలుగా డాక్టర్ పైడి సింధూర

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

2025-26 సంవత్సరానికి లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన అధ్యక్షురాలుగా డాక్టర్ పైడి సింధూర ఏకగ్రీవంగా ఎంపికయ్యారని లైన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్ సోమవారం తెలిపారు. శ్రీకాకుళంలోని క్లబ్ కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగిందని, ఎన్నికల పర్యవేక్షణాధికారిగా సీనియర్‌సభ్యులు బరాటం లక్ష్మణరావు నిర్వహించారన్నారు. కార్యదర్శిగా టెక్కం రామ్‌గోపాల్, కోశాధికారిగా బరాటం కృష్ణచైతన్య, ఉపాధ్యక్షులుగా బి.ఉమామహేశ్వరరావు, ఉర్లం శివతేజ పట్నాయక్‌లు ఎన్నికయ్యారని, 2025 జూలై 1 నుంచి 2026 జూన్ 30 వరకు ఈ నూతన కార్యవర్గం పని చేస్తుందని జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, డిసి డాక్టర్ బాడాన దేవభూషణరావు తెలిపారు. కార్యక్రమంలో పొఫెసర్ డి.విష్ణుమూర్తి, సభ్యులు అంధవరపు ప్రసాద్, నారా ఈశ్వరరావు, ఈనాడు ఈశ్వర్, శిల్లా మణి, సీపాన. రమేష్, పొడుగు చరణ్, అడపాక. శాంతి తదితరులు పాల్గొన్నారు.



## వాకర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ కొంక్యాన మురళీధర్ ఆధ్వర్యంలో నగరంలోని చిన్నబజార్ కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్సీ కర్రోతు సత్యం, జి.ఇందిరాప్రసాద్, జి.సత్యనారాయణ, పి.ఉమామహేశ్వర రావు, పి.జి.గుప్తా, కె.వి.ఆర్.మూర్తి, ఎన్.జోగినాయుడు, కొంక్యాన వేణుగోపాల్, సుగంధం సంజీవరావు, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.



## గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండండి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతి మనిషి గుండెను పదిల పర్చుకోవాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఏడాదికి ఒకటి రెండుసార్లు గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని మెడికవర్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ మల్లా ఫణీంద్ర అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్-102 గవర్నర్ కొంక్యాన మురళీధర్ ఆధ్వర్యంలో నగరంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్యం, అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆరోగ్యంగా కనిపించే మనిషి అకస్మాత్తుగా గుండెపోటుకు గురవుతుంటారని, అందువల్ల పరీక్షలను ఎప్పటికప్పుడు చేయించుకుంటూ జాగ్రత్త వహించాలన్నారు. సాయి డెంటల్ కళాశాల చైర్మన్ డాక్టర్ మధుకర్ విలేకర్ మాట్లాడుతూ గతం కంటే ఇప్పుడు దంత సమస్యలు ఎక్కువగా నమోదవుతున్నాయని, మధ్య వయస్కులు, వృద్ధులు దంత వ్యాధులపై జాగ్రత్త వహించాలన్నారు. వాకర్స్ పూర్వపు గవర్నర్లు కర్రోతు సత్యం, జి.ఇందిరాప్రసాద్, జి.సత్యనారాయణ, పి.ఉమామహేశ్వరరావు, పి.జి. గుప్తా, కె.వి.ఆర్.మూర్తి, వాకర్స్ ప్రతినిధులు ఎస్.జోగి నాయుడు, కొంక్యాన వేణుగోపాల్, సుగంధం సంజీవ రావు, బసవరాజు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంవాసు, వైద్య ఆరోగ్య సిబ్బంది పి.చంద్రశేఖర్, టి.నీల వేణి, కె.జానకి సహకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు పొట్నూరు నాగేశ్వరరావు, పంచాది నారాయణమూర్తి, పి.మురళీకృష్ణ, బహదూర్ భాషా, గౌరీశంకర్, ప్రేమ్‌కుమార్, గేదెల లక్ష్మీ, ఎస్.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జపాన్‌లో అద్భుతమైన కూచిపూడి నృత్యంతో అలరించిన శ్రీకాంత్ శిష్య బృందం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారత్ పెవీలియన్ సెంటర్, ఒసాకా, జపాన్‌లో జరుగుతున్న వరల్డ్ ఎక్స్‌పో-2025లో మన ఆంధ్రప్రదేశ్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీకాంత్ శిష్య బృందం జపాన్‌లో అద్భుతమైన నాట్య ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ తొలి ప్రదర్శన ఒసాకాలో, భారత్ పెవీలియన్ సెంటర్లో జరిగింది. కార్యక్రమానికి జపాన్, భారత్ అంబాసిడర్లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. శ్రీకాంత్ శిష్య బృందమైన శ్రీ భాష్యం సుందర రామ కౌండిన్య, నేహా పట్నాయక్, గాయత్రి వర్షిత, అన్నా నేహా థామస్, చాందిని, లలిత చేసిన ఈ ప్రదర్శనకు అక్కడకు విచ్చేసిన వారందరూ నిల్చుని తమ కరతాల ధ్వనులను అందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంస్కృతిక శాఖ, ఏపీఈడీపీ వారి తరపున ఆంధ్రప్రదేశ్ నుండి శ్రీకాంత్ రఘుపాత్రుని శిక్ష బృందం ప్రాతినిధ్యం వహించారు.




## లీజ్ మాఫియాపై పవన్ ఉక్కుపాదం



'రిటర్న్‌గిఫ్ట్‌కి థ్యాంక్స్' అంటూ పవన్ కల్యాణ్ పంపిన సందేశం టాలీవుడ్‌లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎక్కడ చూసినా ఇదే హాట్ డిస్కర్షన్. జగన్ హయాంలో తెలుగు చిత్రసీమకు అన్యాయం జరిగింది. అగౌరవం ఎదురైంది. అలాంటప్పుడు.. నిర్మాతల తరపున మాట్లాడింది కేవలం పవన్ కల్యాణ్ మాత్రమే. 'నా సినిమాని ఆపుకోండి.. మిగిలినవాళ్లని వదిలేయండి' అనే స్టేట్‌మెంట్ ఇచ్చి తన తెగింపు, త్యాగం నిరూపించుకొన్న వ్యక్తి. అసలు సిసలు సినిమా ప్రేమికుడు. అలాంటి పవన్ కల్యాణ్‌నే కెలకడానికి ప్రయత్నించారు. హరి హర వీరమల్లు సినిమా విడుదల ముందు ఆడిన ఈ థియేటర్ల బంద్ నాటకం పవన్‌కి తిక్కరేగేలా చేసింది. ఇప్పుడు లెక్కలు బయటకు తీయడానికి ఆయన రెడీ అవుతు న్నాడు. థియేటర్ల బంద్ వెనుక ఓ పెద్ద స్కామ్ దాగుందన్నది నూటికి నూరుపాళ్లు నిజం. తెలుగు చిత్రసీమ గురించీ, ఇక్కడి వ్యవస్థ గురించి తెలిసిన వాళ్లెవరికైనా ఈ సంగతి సులభంగా అర్థం అవుతుంది. పైకి.. థియేటర్ వ్యవస్థని కాపాడడానికీ, థియేటర్ యజమానుల ఆర్థిక ప్రయో జనాల కోసమే ఇదంతా అని అనిపిస్తుంది కానీ, అసలు థియేటర్లన్నీ ఎవరి చేతుల్లో ఉన్నాయి? పర్సంటేజీ విధానం అమలు చేస్తే ఎవరికి లాభం? అనే విషయాలు తెలిస్తే ఈ కుట్రదారు లెవరో అర్థం అవుతుంది. ఏపీ, తెలంగాణల్లో ఉన్న థియేటర్లలో సగానికి పైగా అల్లు అర వింద్, సురేష్ బాబు, దిల్ రాజు, ఏసియన్ సునీల్ చేతుల్లో ఉన్నాయి. కొన్ని సొంతం.. చాలా మట్టుకు లీజ్. మిగిలిన థియేటర్లపై కూడా వీళ్ల ఆధిపత్యం ఉంది. ఏ థియేటర్లో ఏ సినిమా ఆడించాలి? అనేది వీళ్లే డిసైడ్ చేయగలరు. వీళ్లు ఆడిందే ఆట.. పాడిందే పాట. ఇప్పుడు థియేటర్లకు పర్సంటేజీ విధానం అమలు చేస్తే లాభం వీళ్లకే. అందుకే వెనుకుండి ఈ తతంగం అంతా నడిపించారు. ఈ బంద్‌కు ఉసిగొల్పింది వీళ్లే. అయితే యాక్టీవ్ నిర్మాణ సంస్థల్లో ముఖ్యమైన మైత్రీ మూవీస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, వైజయంతీ లాంటి పెద్ద సంస్థలు వీటిని వ్యతిరేకించాయి. దాంతో అసలు గొడవ మొదలైంది. అద్దె, పర్సంటేజీ ఈ రెండు విధానాల వల్ల లాభాలూ ఉన్నాయి, నష్టాలూ ఉన్నాయి. అద్దె అంటే నికరమైన ఆదాయం. సూపర్ హిట్ సినిమాకూ, ఫ్లాప్ సినిమాకూ థియేటర్ల యజమానులకు వచ్చే ఆదాయంలో మార్పేం ఉండదు. కానీ పర్సంటేజీ అలా కాదు. ఓ సూపర్ హిట్ సినిమా వస్తే, నిర్మాత రాబడిలో కొంత థియేటర్ యజమాని పర్సంటేజీ రూపంలో లాక్కెళ్లిపోతాడు. కాకపోతే ఆ అంతరం చాలా ఎక్కువగా కనిపిస్తోంది. ఉదాహరణకు అద్దె రూపంలో రూ.5 లక్షలు చెల్లించాల్సిన చోట, పర్సంటేజీ విధానం వల్ల రూ.10 లక్షలు ఇవ్వాల్సివస్తుంది. ఇదంతా నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ లాభాల్లో కోత అన్న మాట. అలాగని ప్రతీ సినిమాకీ ఇదే పద్ధతి ఉండదు. చిన్న సినిమా విడుదలైతే లీజుదారులకు అద్దెలే కావాలి. పర్సంటేజీలు వద్దు. ఎందుకంటే చిన్న సినిమాలకు కలక్షన్లు ఉండవు కాబట్టి. అంటే హిట్ సినిమా నుంచి దోచుకోవడానికి రెడీ అయిన లీజు దారులు, ఫ్లాప్ సినిమా బాధల్ని పంచుకోవడానికి మాత్రం ముందుకు రారన్న మాట. ఒకవేళ చిన్న సినిమా కూడా పర్సంటేజీ విధానంపై ఆడించాలంటే థియేటర్‌కు వాటా ఎక్కువ ఇవ్వాల్సివస్తుంది. కలక్షన్ రూపంలో వంద రూపాయలు వస్తే, అందులో 60 శాతం థియేటర్ కి, మిగిలిన 40 శాతం నిర్మాతకీ. అంటే ఓ నిర్మాత సినిమాలు తీస్తోంది థియేటర్ లీజు దారుల కోసమని సర్దుకుపోవాలన్నమాట. ఇదెక్కడి న్యాయం?? ఎగ్జిబీటర్లంతా ఛాంబర్‌లో చాలా దఫాలుగా సమావేశమయ్యారు. తమ డిమాండ్లేంటో వినిపించారు. ఆ సమావేశాలకు పట్టుమని వంద మంది కూడా హాజరవ్వలేదు. తెలుగు రాష్ట్రాల్లో వెయ్యిమందికి పైగా ఎగ్జిబీటర్లు ఉంటే, సమావేశాల్లో కనిపించింది అందులో పది శాతం మాత్రమే. అంటే.. నిజానికి ఎగ్జిబీటర్లకు ఈ పర్సంటేజీ విధానంపై ఎలాంటి ఆసక్తి లేదన్నమాట. ఎందుకంటే అద్దె అయినా, పర్సంటేజీ అయినా వాళ్లకు ఒరిగేది ఏం ఉండదు. ఎందుకంటే వాళ్ల థియేటర్లన్నీ ఎప్పుడో లీజులకు ఇచ్చేశారు. సొంత థియేటర్లు ఉన్నా, వాటిపై లీజు ఫీజు తీసుకొంటూ గడిపేస్తున్నారు. థియేటర్లు వాళ్లవైనా వాటిపై పెత్తనం లీజు దారులవే. ఇదంతా కేవలం లీజు దారులు ఆడిస్తున్న డ్రామా కాబట్టే, వీటితో ఎగ్జిబీటర్లకు ఎలాంటి లాభం లేదు కాబట్టి వాళ్లంతా సైలెంట్ అయిపోయారు. నిర్మాతల్లో 90 శాతం మంది ఈ పర్సంటేజీ విధానానికి వ్యతిరేకంగా ఉన్నారు. ఇప్పటికే నిర్మాతలు కుంగిపోతున్నారు. అన్ని రకాలుగా వాళ్లపై అదనపు భారం పడుతోంది. ఇప్పుడు పర్సంటేజీ అంటూ రాబడిలో వాటా అడిగితే నిర్మాత అనేవాడు కనుమరుగైపోయే ప్రమాదం ఉంది. నిర్మాతని కాపాడాలి అంటే.. అసలు ఈ వ్యవస్థనే సరిదిద్దాలి. అందుకే ఇప్పుడు పవన్ కల్యాణ్ ఆ దిశగా అడుగులు వేయబోతున్నట్టు అర్థం అవుతోంది. థియేటర్లకు ప్రేక్షకులు రావడం లేదు, అందుకే ఆదాయాలు తగ్గుతున్నాయి అనేది అందరూ ఒప్పుకోవాల్సిన నిజం. అటు ఎగ్జిబీటర్లకూ, ఇటు డిస్ట్రిబ్యూటర్లకూ, నిర్మాతకూ డబ్బులు మిగలాలంటే, ఈ మూడు వ్యవస్థలూ బాగు పడాలంటే ప్రేక్షకులు థియేటర్లకు రావాలి. అలా రావాలంటే థియేటర్లలో మౌళిక సదుపాయాలు సరిగ్గా ఉండాలి. ప్రేక్షకులు టికెట్ రేట్ చూసి భయపడడం లేదు. థియేటర్లో జరుగుతున్న దోపిడీకి భయపడుతున్నాడు. రూ.150 లకే టికెట్ కొనొచ్చు. కానీ థియేటర్లో పాప్‌కార్న్ రేట్ అంతకంటే ఎక్కువ. బయట ఇరవై రూపాయలకు దొరికే వాటర్ బాటిల్.. థియేటర్లలో 60 రూపాయలకు అమ్ముతున్నారు. పార్కింగ్ ఫీజు తో అదనపు భారం పడుతోంది. ఇదంతా థియేటర్ యజమానులకు వెళ్తుందా అంటే అదీ లేదు. ఈ డబ్బులు కూడా లీజు దారుల జేబుల్లోకే చేరుతున్నాయి. అందుకే ఈ అడ్డగోలుతనానికి చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు పవన్ కల్యాణ్. ఓటీటీ, పైరసీ.. వీటిపై కూడా పరిశ్రమ దృష్టి పెట్టాలి. ఇప్పటికే ఓటీటీ చేతుల్లో కీలుబొమ్మగా మారిపోయింది చిత్రసీమ. సినిమా విడుదలైన మూడు వారాలకు ఓటీటీలోకి వచ్చేస్తే, ఇక థియేటర్లకు ఎందుకు వెళ్తారు? సినిమా అనేది చవకైన వినోదం. దాన్ని అత్యంత ఖరీదుగా మార్చేసి థియేటర్లకు రానివ్వకుండా చేస్తోంది ఎవరు? ఈ సంక్షోభానికి బాధ్యులు ఎవరు? ఈ లెక్కలు బయటకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం పవన్ కల్యాణ్ కూడా అదే చేయబోతున్నారు. ఇక నుంచి టాలీవుడ్ గేమ్ మారబోతోంది. లీజు దారుల అక్రమాల్ని, అడ్డగోలుతనానికీ చెక్ పెట్టి, ఎవరి కష్టానికి తగ్గ ప్రతిఫలం వాళ్లు అనుభవించేలా ఈ కూటమి ప్రభుత్వం చేయగలిగితే టాలీవుడ్ కు మంచి రోజులు వచ్చినట్టే.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..

## చీర కట్టులో అందాల కేతిక



'రొమాంటిక్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన కేతిక శర్మ చేసిన సినిమాలు తక్కువే అయినా సోషల్ మీడియా ద్వారా దక్కించుకున్న పాపులారిటీ చాలా ఎక్కువ అనే విషయం తెల్సిందే. ఈమె అందమైన ఫోటో షూట్స్, వీడియోలు రెగ్యులర్‌గా వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా మరోసారి ఈమె చీర కట్టు ఫోటోలతో సందడి చేసింది. గతంలో ఎన్నో సార్లు అందమైన ఫోటోలు, వీడియోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచిన కేతిక శర్మ ఈ సారి చీర కట్టు ఫోటోలతో మెప్పించింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్‌తో ఆకట్టుకునే కేతిక శర్మ రొమాంటిక్ హీరోయిన్‌గా ఇండస్ట్రీలో గుర్తింపు దక్కించుకున్న విషయం తెల్సిందే. న్యూఢిల్లీలో 1995లో జన్మించిన ముద్దుగుమ్మ కేతిక శర్మ సోషల్ మీడియాలో వీడియోలు, ఫోటోలు షేర్ చేయడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. ముఖ్యంగా ఈమె చేసిన డబ్స్‌మాష్ వీడియోలు బాగా వైరల్ అయ్యాయి. టిక్‌టాక్ వీడియోలు, ఇన్‌స్టారీల్స్ కారణంగా ఏకంగా సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంది. తక్కువ సమయంలోనే ఎక్కువ పాపులారిటీని సొంతం చేసుకున్న ఈ అమ్మడికి హీరోయిన్‌గా మంచి గుర్తింపు లభించింది. కానీ లక్ కలిసి రాకపోవడంతో కమర్షియల్ బ్రేక్ దక్కడం లేదు. ఈ అమ్మడు మోడలింగ్‌పై ఆసక్తితో కాలేజ్ పూర్తి అయిన వెంటనే ఆ రంగం వైపు అడుగులు వేసింది. సోషల్ మీడియాలో వచ్చిన గుర్తింపు కారణంగా ఇండస్ట్రీలో ఆఫర్లు దక్కించుకుంది. 2021లో ఆకాష్ పూరితో కలిసి రొమాంటిక్ సినిమాలో నటించి రొమాంటిక్ ముద్దుగుమ్మగా పేరు సొంతం చేసుకుంది. ఆ తర్వాత నాగ శౌర్యతో కలిసి లక్ష్య సినిమాలోనూ నటించింది. తెరపై అందంగా కనిపించడంతో పాటు, సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా కేతిక శర్మ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా ఉంటుంది. మెగా హీరో వైష్ణవ్ తేజ్‌తో కలిసి రంగ రంగ వైభవంగా సినిమాలో నటించింది. ఆ సినిమాపై చాలా ఆశలు పెంచుకున్న కేతిక శర్మకు నిరాశ మిగిలింది. దాంతో కేతిక ఆఫర్లు చాలా తగ్గాయి. ముఖ్యంగా కేతిక శర్మ పాత్రల ఎంపిక విషయంలో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటుంది అనే విమర్శలు వచ్చాయి. కేతికశర్మ తాజా ఫోటో షూట్‌లో అందమైన చీరకట్టు ఫోటోలతో మెప్పించింది. సాధారణంగానే ముద్దుగుమ్మలు చీర కట్టులో అందంగా కనిపిస్తూ ఉంటారు. అందాల ముద్దుగుమ్మ కేతిక శర్మ చీరకట్టులో మరింత అందంగా కనిపిస్తుంది అంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. చీర కట్టి హొయలు పోతున్న ముద్దుగుమ్మ కేతిక శర్మ మరోసారి అందంగా కనిపించడం మాత్రమే కాకుండా కవ్వించే చూపులతో మెప్పించింది. చీరకట్టు లో కేతిక శర్మ చూపు తిప్పనివ్వడం లేదు అంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. ఈ రొమాంటిక్ హీరోయిన్ ముందు ముందు అయినా సినిమాల్లో బిజీ కావాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

## స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చెయొద్దని, కార్మికుల తొలగింపు ఆపాలని, లేకుంటే మోడి ప్రభుత్వానికి తగిన మూల్యం తప్పదని సిఐటియు జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్ స్వప్నిల్ పుండ్కర్‌కు వినతిపత్రం అందించారు. ధర్నా నుద్దేశించి వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కోసం కేంద్ర బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. తన కుట్రలు మానుకోవాలని కోరారు. 32 మంది ప్రాణత్యాగాలతో, వామపక్ష ఎమ్మెల్యే, ఎంపీల రాజీనామాలతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు విశాఖ స్టీల్‌ను సాధించుకున్నారని గుర్తు చేశారు. 64గ్రామాల ప్రజలు 24వేల ఎకరాల భూములను రైతులు త్యాగం చేశారన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న 3వేల మందిని తొలగించారన్నారు. మరో 2వేల మందిని తొలగించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే, వారి పరిస్థితి ఏమిటి అని, వారిపై ఆధారపడ్డ కుటుంబాల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన టీడీపీ, జనసేన పార్టీలు తమ హామీని నిలుపుకోవాలన్నారు. కేంద్ర బీజేపీ చర్యలకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న లక్షల కోట్ల విలువైన భూములను కార్పొరేట్లకు అప్పగించడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. పోరాడి సాధించిన విశాఖ స్టీల్‌ప్లాంట్ సొంత గనులు కేటాయించి సెయిల్‌లో విలీనం చేసి పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిస్థితి మరింత దిగజారిందన్నారు. మోడీ ప్రభుత్వం ప్లాంట్ పరిరక్షణకు చర్యలు చేపట్టకపోగా, ప్లాంట్‌ను నాశనం చేయడానికి అన్ని ప్రయత్నాలు ముమ్మరం చేసిందన్నారు. విశాఖ స్టీల్ దేశంలోనే నాణ్యమైన డిమాండ్ ఉన్న స్టీల్ అని, కావాలనే ఉత్పత్తి తగ్గించి కేంద్ర బీజేపీ విశాఖ స్టీల్‌ను నష్టాల్లోకి నెట్టి ప్రైవేట్‌కు అప్పగించాలని చూస్తుందన్నారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.చందర్రావు, ఎఐటియుసి జిల్లా నాయకులు చిక్కాల.గోవిందరావు, సిఐటియు జిల్లా నాయకులు ఎమ్.ఆదినారాయణమూర్తి, అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎమ్.డి.ఎమ్ యూనియన్ నాయకులు తూతిక.ప్రవీణ, బిఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకులు ఎమ్.గోవర్ధనరావు, పెన్సనర్స్ యూనియన్ నాయకులు పార్వతీశం, నాగార్జున అగ్రికెమ్ యూనియన్ నాయకులు ఎ.సత్యనారాయణ, ఎల్.రామప్పుడు, ఎమ్.రమణ, కేదారేశ్వరరావు, పి.సుధాకర్ బాబు, టి.రవికుమార్, వైఎస్ఆర్ జిల్లా మేధావులు విభాగం ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.





ఏపీ ట్రెజరీస్, సర్వీసెస్ అసోసియేషన్

## రాష్ట్ర ఎన్నికలు విజయవంతం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపి ఎన్జీవోస్ విజయవాడ కార్యలయంలో నిర్వహించిన ఏపిటిఎస్ఏ (ట్రెజరి శాఖ) ఎలక్షన్స్‌లో ఆంధ్రప్రదేశ్ ట్రెజరిస్, సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా పాము శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉత్తరంధ్రాకు సంబంధించి, శ్రీకాకుళం జిల్లా నుంచి బొత్స శ్రీనివాస రావు కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికవడం గర్వకారణంగా ఉందని శ్రీకాకుళం జిల్లా ఏపిటిఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శి సోమవారం తెలిపారు. నూతన కార్యవర్గానికి ఏపి ఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు కే.శివారెడ్డి, విద్యాసాగర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా ఏపీటీఎస్ఏ అధ్యక్షులు దొడ్ల శ్రీరామ్‌కుమార్, జిల్లా కార్యదర్శి దేవిడ్ మాదారపు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ బి.ప్రదీప్‌కుమార్, ఐ.జ్యోతిలక్ష్మి, ఎం.సాయిప్రసాద్, వై.కోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పి.చంద్రశేఖర్ స్టేట్ ఈసీ మెంబర్ జి.రాజశేఖర్, బి.గాంధీ, బి.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## యోగాంధ్రలో డ్వామా



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి విశాఖపట్నంలో హాజరుకానున్నారు. ఉత్తరాంధ్ర జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతమయ్యే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో జూన్ 21 నుండి జూలై 20 వరకు యోగాంధ్ర కార్యక్రమాలు జిల్లాలో నిర్వహణ జరుగుతోంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ రోజు గ్రామ స్థాయి నుండి యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శ్రీకాకుళం లో గల 80 అడుగుల రహదారిలో సోమవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ యోగా కార్యక్రమంలో డ్వామా అధికారులు, సిబ్బంది, వేతన దారులు శ్రీకాకుళం నగర వాసులు సుమారు 500 మంది వరకు పాల్గొని యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో యోగా టీచర్లు పాండ్రంకి మురళి కృష్ణ, తంగి స్వాతి, వి.సందీప్, ఆయుష్ డాక్టర్ జగదీష్, మెప్మా పీడీ సుధాకర్, ఫీల్డ్ స్టాఫ్, కార్యాలయ సిబ్బంది, యోగా శిక్షకులు మురళీకృష్ణ, తంగి స్వాతి, వి. సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## రహదారిని వెంటనే నిర్మించండి

(సత్యంన్యూస్, పలాస)

బెండు గేటు నుండి వజ్రపు కొత్తూరు మండల కేంద్రం ప్రధాన రహదారి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించక పోతే రోడ్డు దిగ్బంధనం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యులు కే మోహనరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం బెండిలో ప్రజా సంఘాలు మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో పోరుయాత్ర చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం సిఆర్ఐఎఫ్ నిధుల నుండి మూడు సంవత్సరాల క్రితం రూ.30కోట్లు కేటాయించారని, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఉన్న రోడ్డును తవ్వేయడం వలన గత మూడు సంవత్సరాలుగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్రప్రభుత్వం నుండి నిధులు మంజూరు అయినా ఎందుకు తీసుకు రావడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఎందుకు నిధులు విడుదల చేయడం లేదని వారు ప్రశ్నించారు. బెండి రోడ్డు తవ్వడం వలన నీరు నిల్వ అయి రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని వారన్నారు, అదేవిధంగా గ్రామస్తులు దుమ్ము, ధూళి, బురదతో వ్యాధులు బారినపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెండి రోడ్డు విషయం ప్రభుత్వానికి పట్టదా అని వారు ప్రశ్నించారు, బెండి గ్రామంలో జరిగిన పోరు యాత్రలో సిఐటియు నాయకులు ఎన్.గణపతి రైతుసంఘం నాయకులు కోనారి హేమసూధనరావు, కె.బాలాజీ, తమ్మినాన భాస్కరరావు, కార్మిక సంఘం నాయకులు కె.వెంకటరావు, బి.ధర్మారావు, బి.శంకర్, డివైఎఫ్ఐ సంఘం నాయకులు కె.మహేష్, ఎం.రమేష్, డి.హరికృష్ణ, శేఖర్, హనుమంతు బాలకృష్ణ, హెచ్.చిన్నారావు, తారకేశ్వరరావు, కనకారావు తదితరులు పాల్గొన్నారు.



## ఆశయాలకు మరణం ఉండకూడదు

(సత్యంన్యూస్, విజయనగరం)

మనిషికి మరణం ఉండొచ్చు కానీ కాని ఆశయాలకు మరణం ఉండకూడదనే లక్ష్యంతో రక్తదాన శిబిరం, అవయవదాన అవగాహన సదస్సులు విజయవంతంగా నిర్వహించినట్లు "స్వాస్ సేవా సంఘం" ప్రతినిధులు పేర్కొన్నారు. జిల్లాలోని గురునాయుడుపేట గ్రామం, ఫకీరు కిత్తలి గ్రామ పంచాయతీ, గుర్ల మండలం,విజయనగరం జిల్లా కు చెందిన స్వాస్ సేవాసంఘం సభ్యులు బూర్లె పైడినాయుడు పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా విజయనగరం సీతం కాలేజీలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం, అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పౌర వేదిక అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, కల్నల్ గోపేంద్ర, గర్ల్స్ బెటాలియన్ విజయనగరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవయవ దాతల సంఘం (బ్లడ్ మాన్)వినోద్ బాలు, సత్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు విచ్చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి అతిథులు మాట్లాడుతూ పుట్టినరోజులు, పెళ్లిరోజులు అనగానే ఎవరిని పిలవాలి.. ఎంత మందిని పిలవాలి.. ఏం పెట్టాలి.. ఏ పబ్బుకి వెళ్లాలి.. అనే ఈ రోజుల్లో పైడినాయుడు పుట్టినరోజు సందర్భంగా ఈ రక్తదాన శిబిరం, అవయవ దాన అవగాహన సదస్సు కార్యక్రమం పెట్టడం చాలా విశేషమని, రక్తదానం వేరొక కుటుంబానికి జీవిత కాలం అని, మరణించిన జీవించడానికి అవయవదానం చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పిడికిల ప్రభాకర్‌రావు, పల్సర్ బైక్ రమణ, శేఖర్, చంద్రిక, సత్య కాలేజీ ప్రిన్సిపల్ సాయి దేవమని, సత్యవేణి, అరుణ, రితిక్ మాస్టర్, ఏ టు జెడ్ ఈవెంట్స్ చంద్రశేఖర్, ఉటపల్లి రమణ, గణేష్, సింగర్ శివ, పద్మలత, బొడ్డేపల్లి రామకృష్ణ, వెంకట రమణ, పరమేష్, చారి, స్వాతి,ఎవిరిడే హ్యాపీ చిన్న, శ్రీను,రాము, ఎన్విఎన్ నాగేశ్వరరావు, ఇప్పలవలస గోపి, కమలనాయుడు, తిమనాన రాంబాబు, గేద్ద చిరంజీవి, ఎక్స్ ఆర్మీ సారిక అప్పారావులు పాల్గొన్నారు.




'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

## బాలల్లో సృజనాత్మకత గుర్తించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



బాలల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించేందుకు వాసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారి పి. ఉగ్రసేను అన్నారు బలగ హడ్కో కాలనీలో గల శాఖా గ్రంధాలయం లో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా సోమవారం ఉదయం పిల్లలకు నీతి పద్యాలు నీతి కథలు చెప్పి ఉత్సాహపరిచారు. అనంతరం వారి జ్ఞాపకశక్తి పై పోటీ పెట్టారు. ముందుగా కొన్ని జంతువులు ఫోటోలు చూపించి చూడకుండా వ్రాయడంపై పరీక్ష పెట్టారు. ఈ పోటీలో 27మంది విద్యార్థులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు



కడపలో గల శ్రీగండి ఆంజనేయస్వామిని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, కడప

## ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితుల శిబిరం ప్రారంభం

(సత్యంన్యూస్, మెళియాపుట్టి)

మెళియాపుట్టి మండలం చీపురుపల్లి గ్రామంలో ఆఫ్ షోర్ నిర్వాసితుల దీక్ష శిబిరాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా నిర్వాసితులకు రావలసిన ప్యాకేజీ అర్హత తేదీలను పెంచాలని, అర్హత కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి ఐదు సెంట్లు ఇండ్ల స్థలం మంజూరు చేయాలని, ఉపాధి నిమిత్తం వలస పోయిన గ్రామ ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని, నిర్వాసిత కుటుంబాలకు అంత్యోదయ రేషన్ కార్డులను మంజూరు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



## ప్రతి సాహిత్యాభిమాని ఒక సంఘజీవి



(సత్యంన్యూస్, కొత్తూరు)

సమాజాన్ని పరిశీలిస్తూ, సంఘంలో గల మూఢనమ్మకాలనే రుగ్మతలను పారద్రోలాలని, సంస్కరణలతో కూడిన పురోగతిని చేకూర్చాలని రచయితలు కృషి చేస్తారని, సంఘజీవులై నిలుస్తారని ప్రముఖ సాహితీవేత్త పొట్నూరు కోటిబాబు అన్నారు. స్థానిక విజ్ఞానభారతి పాఠశాల ఆవరణలో నిర్వహించిన కొత్తూరు రచయితల వేదిక రెండోనెల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కోటిబాబు మాట్లాడుతూ ఆనాటి స్వాతంత్ర్య సమరంలో ప్రజలను చైతన్యపరిచే విధంగా, దేశభక్తిని పెంపొందించే విధంగా సాహితీవేత్తల గీతాలు ఎంతగానో దోహదపడినట్లు ఆయన గుర్తుచేశారు. అనేక దురాచారాలను రూపుమాపేందుకు, ప్రజలను కార్యోన్ముఖులుగా తీర్చిద్దేలా చైతన్యపరిచేందుకు ఈ సాహిత్యం ఎంతగానో తోడ్పడునని కోటిబాబు అన్నారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కుదమ తిరుమలరావు సమన్వయంతో నిర్వహించిన కవిసమ్మేళనంలో కుదమ తిరుమలరావు వందనం, కలమట శ్రీరాములు భాషా ఔన్నత్యం, డా.యెన్ను అప్పలనాయుడు మాతృభాష నినాదం, ముదిల శంకరరావు జాతీయ పతాకం, పెదకోట ధనుంజయరావు శ్రమజీవి, గడసాపు ఉషారాణి వీరజవాను, ఎవిఆర్ఎం రాజా దిలీప్ పట్నాయక్ భాషకు వెలుగు 'కొరవే', గేదెల మన్మధరావు ఆపరేషన్ సిందూర్, బూరాడ గణేష్ అభిమతం అను కవితలను వినిపించి అందరి ప్రశంసలు పొందారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథి పొట్నూరు కోటిబాబును, కవి సమ్మేళనంలో పాల్గొన్న కవి కవయిత్రులను శాలువాలతో గ్రంథాలతో వేదిక ఘనంగా సన్మానించింది. అనంతరం ప్రతిభావంతులుగా ఎంపికైన బాలబాలికలు సాసుబిల్లి జయంతి, ఉర్లాపు శశిధర్, యు.భువనేశ్వర్, ఆరిమితిల, ఎ.పూర్ణచంద్ర, ఎ.బేబిశ్రీ, రౌతు నైనిష, వండాన సహశ్రీ, బొమ్మన లిశిత, గోరుశెట్టి ధనుష్, వండాన కీర్తనలను ప్రోత్సహిస్తూ వేదిక సభ్యులు ముదిల శంకరరావు కాపీబుక్స్‌ను బహూకరించారు. సభ్యురాలు గడసాపు ఉషారాణిచే తర్ఫీదు పొందిన మూడో తరగతి చిన్నారులు బౌరి మనీష్ కుమార్, బి.అజయ్‌లు సంకేత అవధానం ప్రక్రియను గావించారు. అనంతరం మనీష్, అజయ్‌లను అభినందిస్తూ శంకరరావు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కుదమ తిరుమలరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో దుక్క గణపతి రావు, సి.హెచ్.మార్కో, బౌరి మురళి, బి.పద్మ, జన్ని నాగరాజు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సాహిత్యంలో హృద్యమైనది పద్యమే

(సత్యంన్యూస్, రాజాం)

వెయ్యేళ్లకు పైగా సాగిన తెలుగు సాహిత్య చరిత్రను తరచి చూస్తే, నేటికీ హృద్యమైనది పద్యమేనని ఆంధ్ర వైయాకరణ వాచస్పతి డాక్టర్ ఏ. గోపాలరావు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీకాకుళం రోడ్‌లోగల శ్రీ కల్కి ఇన్‌లో రాజాం రచయితల వేదిక 124వ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన బెహరా రామకృష్ణ కవి రచించిన నలచరిత్ర అనే ప్రబంధాన్ని ఆవిష్కరించారు. అనంతరం గోపాలరావు మాట్లాడుతూ వెయ్యేళ్ళ క్రిందటి నుండి వస్తున్న పద్యమే తెలుగు సాహిత్య ప్రక్రియలన్నిటి కంటే హృద్యమైనదని, అది చిరంజీవి అని చెప్పారు. కళింగాంధ్రకు చెందిన రామకృష్ణ కవి 200ఏళ్ల క్రితం ఇంతటి గొప్ప ప్రబంధాన్ని రాయడం అద్భుతమన్నారు. నేటి కవులు, రచయితలందరూ ప్రాచీన సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉందన్నారు. ఆధునిక సాహిత్య కర్తలలో పేరుబడ్డ శ్రీశ్రీ, ఆరుద్ర, గురజాడ, గిడుగు రామ్మూర్తి పంతులు, తాపీ ధర్మారావు ఇలాంటి వారందరూ ప్రాచీన సాహిత్యాన్ని బాగా చదివారని గుర్తు చేసారు. వేదిక నిర్వాహకుడు గార రంగనాథం అధ్యక్షతన జరిగిన సాహిత్య సభలో అతిథులుగా కొత్తా భాగ్యలక్ష్మి, కుప్పిలి రామకృష్ణ రంగారావు, మేడూరి సూర్య సత్యనారాయణ మూర్తి, కొత్తా రమేష్, మధుసూదన రావు, పిల్లా తిరుపతిరావు, అల్లిమోహన రావు, పొదిలాపు శ్రీనివాసరావు, ఒమ్మి రమణ మూర్తి, తనికెళ్ల లక్ష్మీనారాయణ మూర్తి, మంగిపూడి శ్రీనివాసరావు, సమతం మహేశ్వరరావు, పొట్నూరు కోటిబాబు, రౌతు గణపతిరావునాయుడు, కుదమ తిరుమలరావు, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ల కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

## హమ్మయ్య... పలకల కింద

# సిల్ట్ తీశారు





- పరిశీలించిన కమిషనర్, హెల్తాఫీసర్
- డెబ్రిస్ తొలగింపునకు స్పెషల్ డ్రైవ్
- యుద్ధప్రాతిపదికన మురుగుతీత పనులు
- 'సత్యం' వార్తకు స్పందన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కాలువలు డెబ్రిస్‌తో నిండిపోతున్నాయని, దీనిపై 'కమిషనర్ గారూ.. కాస్త పట్టించుకోండి' అని శనివారం 'సత్యం' ప్రచురించిన కథనంపై కార్పొరేషన్ స్పందించింది. ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఉదయం తుమ్మావీధిలో కమిషనర్ ప్రసాదరావు, హెల్తాఫీసర్ సుధీర్‌లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, శానిటరీ సెక్రటరీ సతీష్‌తో కలిసి పర్యటించారు. ఈమేరకు వీధిలో నీరు నిల్వ ఉండిపోవడానికి కారణమైన పెద్ద కాలువపై పలకలు తొలగించి, అందులోని సిల్ట్‌ను తొలగించే పనులను చేపట్టారు. జేసీబీ పెట్టి సిల్ట్ తొలగించారు. దీనిపై స్థానికులు హర్షం తెలిపారు.

ఎప్పటికప్పుడు కాలువల్లో చెత్తను తొలగిస్తున్నామని, అయినప్పటికీ కాలువల్లో పాలిథిన్ కవర్లు, చెత్త పారబోస్తుండటంతో ఇలా మురుగు పేరుకుపోతోందని సచివాలయం శానిటేషన్ సెక్రటరీ సతీష్ అన్నారు. ఎండను సైతం లెక్కచేయక స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కాలువల్లో పూర్తిగా మురుగు తొలగింపు చర్యలు రోజూ చేపడుతున్నామని తెలిపారు. అయితే స్థానికులు ఇళ్లలోని చెత్తను బయట పారబోయకుండా వీధుల్లోకి వచ్చే చెత్తబండికి అందించాలని, అప్పుడు మురుగు నీరు రోడ్లపైకి రాదని, కాలువలు పేరుకుపోవన్నారు.







# రైతుబజారు కల్వర్టుకు మోక్షం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రైతుబజార్ జంక్షన్‌లో ప్రధాన కల్వర్టుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇలిసిపురం జంక్షన్ నుంచి రైతుబజార్‌కు వెళ్లే మెయిన్‌రోడ్డు కాలువ మీద పలకలు అడ్డదిడ్డంగా ఉండటంతో పాటు రోడ్డు కూడా పాడవడంతో ఇన్నాళ్లూ ప్రజలు నానా ఇబ్బందులూ పడ్డారు. నాలుగు రోజుల క్రితం కాలువ మీద పలకలు తొలగించి, కూలిన కాలువగట్లను పునర్నిర్మించి, కొత్తగా కల్వర్టు నిర్మిస్తున్నారు. ఈమేరకు పనులు కూడా ప్రారంభమయ్యాయి. రైతుబజారుకు వెళ్లడానికి ఇదే మెయిన్ రోడ్డు కావడంతో ప్రస్తుతానికి పక్కనే ఉన్న రోడ్డు వైపు నుంచి ట్రాఫిక్‌ను మళ్లించారు. మార్చి 13న 'నమ్మండి.. ఇవి కార్పొరేషన్ రోడ్లేనండి' పేరిట 'సత్యం' ఈ సమస్యను ప్రచురించిన వెంటనే ఎమ్మెల్యే గొండు శంకర్ మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. అయితే, అదే సమయంలో ఫారెస్ట్ ఆఫీస్ మెయిన్ రోడ్డు కాలువల్లో పూడికలు తీయడం వల్ల ఎక్కడికక్కడ కాలువ


సంచలన సాయంకాల పత్రిక
సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 13-3-2025
సంపుటి: 20 సంచిక: 297
పేజీలు: 8 వెల: రూ.1

నమ్మండి..

ఇవి కార్పొరేషన్ రోడ్లేనండి!

ఈ ఫొటోలో కనిపిస్తున్న రోడ్డు సాక్షాత్తు నగర పాలక కార్పొరేషన్ పరిధిలోనిదే అనేకంటే జిల్లా ప్రధాన కేంద్రంలోనిదే అని చెప్పాలి. ఇంకా గుండె పగిలే వాస్తవం ఏమిటంటే.. నగరంలో ఏ మూలో ఉన్న కాలనీలోనిది కాదు. జీటీ రోడ్డు నడిబొడ్డులో సూర్యమహల్, చంద్రమహల్ పేర్లు చెబితే గుర్తుపడతారు కదా..! సాక్షాత్తూ వాటి ముంగిట ఉన్న రోడ్లే ఇవి. 2014-19 మధ్యలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉడా నిధులతో ఫుట్‌పాత్‌లు నిర్మించారు. శ్రీకాకుళమేంటి? ఫుట్‌పాత్‌ల మీద నడిచే జనాలెవరు? అనే ఆలోచనే లేకుండా రోడ్డుకు అటూ ఇటూ వీటిని నిర్మించడం వల్ల రోడ్డు మీద నీరు కాలువలోకి వెళ్లక, కాలువలో ఉన్న షిల్ట్ ఎత్తలేక స్వయంగా చంద్రమహల్ ప్రధాన గేటు వద్దే కాలువ, రోడ్డు కలిసి ఉన్న దృశ్యమిది. కాలాలతో సంబంధం లేకుండా దోమలకు స్వర్గధామమైన శ్రీకాకుళం నడిబొడ్డు జీటీ రోడ్డులోనే మురుగు నీరు రోడ్డు మీద నిల్వ ఉంటే ఏమనుకోవాలి?! థియేటర్‌లోకి వెళ్లడానికి కాలువలు, ఫుట్‌పాత్‌ల మీదుగా ర్యాంపులు నిర్మించడంతో వీటిని తొలగించి షిల్టులు తీసే యంత్రాంగం కార్పొరేషన్‌లో లేదు. రోడ్డు వాలు ఎటుంది? కాలువ ఎత్తు ఎంతుంది? అనే ఇంజినీరింగ్ అంచనాలు లేకుండానే శ్రీకాకుళంలో రోడ్లు, కాలువలు నిర్మిస్తుంటారు. ఇక్కడ కాంట్రాక్టరే కింగ్. అది ఏ పార్టీ అయినా అనవసరం. ఇందుకు ఒక ఉదాహరణ చూద్దాం.

కళింగ రోడ్డు వెడల్పు చేసినప్పుడు కాలువలు నిర్మించే కాంట్రాక్టును ఒకరు దక్కించుకున్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా అతి పెద్ద రాయిని ఈ కాలువ నిర్మాణానికి వాడారు. రోడ్డు మీద కుప్పలుగా వేసిన బండల్లాంటి రాళ్లు చూసిన అప్పటి కలెక్టర్ విష్ణు ఇలా చేస్తే బిల్లులు చెల్లించమని, బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించినా అదే రాళ్లతో, అదే కాంట్రాక్టర్ కాలువలు నిర్మించారు. విచిత్రమేమిటంటే.. అందరి కంటే ముందు బిల్లులు తెచ్చుకున్నారు.

స్థానిక ఉమెన్స్ కాలేజీ రోడ్డు మెయింటినెన్స్ పర్స్ జరిగిందని, అది నాశిరకంగా ఉందని తెలుసుకున్న కింజరాపు ఎర్రన్నాయుడు ఆ రోడ్డు పరిశీలనకు వెళ్లి రోడ్డు పక్కన పడిపున్న ఎండుపుల్లను పట్టుకొని రోడ్డును గుచ్చితే పెచ్చులు రావడం మీడియా ప్రముఖంగా ప్రచురించింది కూడా. ఇక్కడా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. శ్రీకాకుళంలో ఏ కాలువా సునాయాసంగా ప్రవహించడానికి వీలుగా వాటంతో ఉండదు. ఏ రోడ్డూ కాలువతో అనుసంధానమై ఉండదు. అటువంటి చోట ఫుట్‌పాత్‌లు నిర్మిస్తే అసలు రోడ్డు మీద నీరు కాలువలోకి పోదు. దాని ఫలితమే కాలువల్లో చెత్త పేరుకుపోవడం, రోడ్డు మీద నీరు నిల్వ ఉండటం.

ఈ ఫొటో స్వయంగా రైతుబజార్ జంక్షన్ వద్దది. సీసీ రోడ్డు ముక్కలైపోయి ఇక్కడ ప్రయాణిస్తున్నవారి వెన్ను విరగ్గొడుతుంది. కాలువ మీద ఉన్న పలకలకు, రోడ్డుకు మధ్య కనెక్షన్ తెగిపోవడంతో ఈ రోడ్డు నుంచి అవతలివైపు వెళ్లడానికి వాహనదారులు నానా యాతన పడుతున్నారు. ఇదెక్కడో మారుమూల ప్రాంతంలో అయితే ఫర్వాలేదు. స్వయంగా నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డు 40 ముక్కలైపోయినా ఎక్కడా కొత్త రోడ్డుకు ప్రతిపాదించిన నాథుడే లేడు. ఎందుకంటే.. ఇప్పటి జనరేషన్‌కు ఊహవచ్చిన దగ్గర్నుంచి కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగలేదు. ఎవరు ఏ పార్టీలో ఉన్నారో, ఎవరు ఏ పార్టీ ఇన్‌ఛార్జో వారికే తెలియదు. ఇక మున్సిపల్ యంత్రాంగం కోసం ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

మీద పలకలు తొలగించారు. దీనివల్ల సబ్‌రోడ్లన్నీ మూసేయాల్సి వచ్చింది. అదే సమయంలో రైతుబజారు రోడ్డు కూడా మూసేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని ఇన్నాళ్లూ ఆగారు. ఇప్పుడు ఈ కాలువ మీద స్లాబ్ వేయడానికి సిద్ధపడుతున్నారు.

## పాస్‌పోర్ట్ పోయినది

నా పేరు అంధవరపు భవాని, D/o తిరుపతిరావు, డోర్ నెంబరు 3-10-19, పుష్పాలవీధి, శ్రీకాకుళం టౌన్, శ్రీకాకుళం జిల్లా. నేను మా ఇంటి నుండి పాస్‌పోర్ట్‌ను జిరాక్స్ తీసుకోవడానికి చిన్నబజారులోని జిరాక్స్ షాప్‌నకు వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో పాస్‌పోర్ట్ జారి పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్ట్ నెంబరు C0652785. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

94940 61644

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- ఆడపిల్లలకు ఉన్నత చదువులు చదివించండి
- రిసోర్స్ పర్సన్ ఆరవెల్లి శాంతిప్రియ




(సత్యంన్యూస్, లావేరు)

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని రిసోర్స్ పర్సన్ ఆరవెల్లి శాంతి ప్రియ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో సోమవారం బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అనే అంశంపై విద్యార్థులకు బోధించారు. మహిళలకు 18 సంవత్సరాలు పైబడిన వారికి మాత్రమే వివాహాలు చేయాలని ఎవరైనా మైనర్లకు వివాహం చేసినట్లయితే చట్టరీత్యా నేరమని, భవిష్యత్తులో పలు ఇబ్బందులు పడతారని ఆమె అన్నారు. తల్లిదండ్రులు వారి ఆడపిల్లలకు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన డిబేటింగ్ పోటీలో షర్మిలకు ప్రథమ, హారికకు ద్వితీయ స్థానాలు రాగా గ్రంథాలయం తరఫున బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చారిత్రక ప్రదేశాల్లో యోగాంధ్ర

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర-2025 పేరిట రాష్ట్రవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు అనుగుణంగా శ్రీకాకుళం జిల్లాలో నాలుగు ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మే 27 నుంచి జూన్ 10 వరకు ఈ యోగా శిబిరాలు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకూ నిర్వహించనున్నారు. మే 27న డచ్ బిల్డింగ్‌లో, జూన్ 3న అరసవల్లి సూర్యదేవాలయంలో, జూన్ 7న సాలిహుండం బౌద్ధ స్థూపాల వద్ద, జూన్ 10న కళింగపట్నం బీచ్‌లో యోగా శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రతి కేంద్రానికి వెయ్యిమందిని హాజరయ్యేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. కొన్ని శాఖల జిల్లా అధికారులు సమీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## పార్క్ నిర్మాణాన్ని ఆపండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తాము జీవనోపాధి సాగిస్తున్న రేవులో పార్క్ నిర్మాణం చేపట్టొద్దంటూ బలగ భద్రమ్మతల్లి రజక కుల సంక్షేమ సంఘం స్థానిక జిల్లాపరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టింది. వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం నేతృత్వంలోని రజకులు దోబీఘాట్ ముద్దు, పార్క్ నిర్మాణం వద్దు అనే నినాదాలతో నిరసన తెలిపారు. అనంతరం గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గేదెల పురుషోత్తం మాట్లాడుతూ 80 కుటుంబాలు ఆ రేవును నమ్ముకొని జీవిస్తున్నాయని, వీరి వల్ల 20 వార్డుల ప్రజలకు సేవలందుతున్నాయని, ఇప్పుడు అక్కడ పార్కును నిర్మిస్తే, వర్షాకాలంలో, వరదలు వచ్చే సమయంలో రజకులకు ఉపాధి కరువవుతుందని అన్నారు. అభివృద్ధే చేయాలనుకుంటో దోబీఘాట్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించాలి తప్ప, జీవనాధారాన్ని తొలగించడం సరికాదన్నారు. పురుషోత్తంతో పాటు వైకాపా నగర అధ్యక్షుడు సాధు వైకుంఠం, రజకులు పాల్గొన్నారు.




## పునరావాసం కల్పించాక తొలగించండి

- గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసిన బలగవాసులు -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక పాలకొండ రోడ్డు విస్తరణలో భాగంగా బలగ ప్రాంతం వద్ద 70 అడుగుల రోడ్డు వెడల్పునకు మార్కింగ్ చేశారని, ఇందులో ఇళ్లు కోల్పోతున్నవారికి పునరావాసం కింద నివాస గృహాలు, నష్టపరిహారం చెల్లించిన తర్వాత తొలగింపులు చేపట్టాలని బలగవాసులు కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు టీడీపీ నాయకుడు రెడ్డి శివన్నారాయణ నేతృత్వంలో 22, 49, 50వ వార్డులకు చెందిన కొందరు బాధితులు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. రోడ్డు వెడల్పు కావడంతో చాలామంది రోడ్డున పడిపోతారని, వారికి కనీసం నిలువ నీడ చూపకుండా ఇళ్లు తొలగించడం సరికాదని, అలాగే స్వచ్ఛందంగా స్థలాలు ఇవ్వడానికి ముందుకొచ్చినవారికి టీడీఆర్ బాండ్లు ఇవ్వలేదని, వీటన్నింటినీ అందజేసిన తర్వాతే పనులు చేపట్టాలని వారు కలెక్టర్‌ను కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పనులు ప్రారంభించిన ముందు స్థానికులకు హామీ పత్రం ఇస్తామని తెలిపారు.

# ఏరిపారేస్తున్నారు..!

(మొదటిపేజీ తరువాయి)

ఎస్పీ మహేశ్వర్ రెడ్డే వ్యక్తం చేశారట. ఆదివారం కళ్లేపల్లి తోటల్లో పేకాడుతున్న ఆరుగుర్ని రూరల్ పోలీసులు మాటువేసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.80వేలు పైచిలుకు నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. కానీ అదే సమయంలో నగరానికి చెందిన కుమార్ అనే రౌడీషీటర్ పోలీసులను నెట్టేసి పారిపోయాడు. ఆయన్ను పోలీసులు వెంబడించినా పట్టుకోలేకపోయారు. ఇదే విషయాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎస్పీ దృష్టిలో పెట్టడంతో పోలీసులంటే లెక్కలేనితనాన్ని సహించేది లేదని, రౌడీషీటర్లందర్నీ మరోసారి పిలిచి ఒళ్లు దగ్గర పెట్టుకోకపోతే బాగుండదని సోమవారం వార్నింగ్ ఇప్పించారు. పోలీసుల్ని నెట్టేయడాన్ని ఎస్పీ సీరియస్‌గానే తీసుకున్నారు. కొద్ది రోజుల క్రితం పెద్దపాడు పద్మావతి కల్యాణ మండపం వెనుక పేకాట డెన్ మీద దాడి చేయడం ద్వారా కొంత సమాచారాన్ని సేకరించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాని ఆధారంగా పాకాల కిశోర్, రవితేజలను అదుపులోకి తీసుకున్నారు. ఇప్పుడు వీరి ఫోన్ ట్రాన్జాక్షన్, బ్యాంకు లావాదేవీలు పరిశీలించిన తర్వాత మరికొందర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. ఇందులో ఒడిశాకు చెందిన బరంపురం శ్రీను ఉన్నట్లు భోగట్టా. రవితేజ దగ్గర దొరికిన వివరాల మేరకు బరంపురం శ్రీను క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నాడని తేలడంతో ఆయన్ను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తుంది. అయితే తామే బెట్టింగులకు పాల్పడి అప్పులపాలైపోయామని, చాలామందికి సొమ్ములు చెల్లించాల్సి ఉందని శ్రీను పోలీసులకు స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు తెలుస్తుంది. ఏడాది కాలంగా ఇక్కడ చాలామంది నుంచి అప్పులు తీసుకొని తప్పించుకు తిరుగుతున్న ఓబీఎస్‌ను శ్రీకాకుళం పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చారని తెలియగానే, అప్పులిచ్చినవారు స్టేషన్ ముందు దర్శనమిస్తున్నారు. లగ్జరీ లైఫ్‌కు అలవాటుపడిన దాయల శ్రీను అలియాస్ ఓబీఎస్ ఎవరెవరికి బకాయిలున్నాడు? ఎందుకున్నాడు? అన్న కూపీ లాగుతున్నారు. గతంలో పేకాట క్లబ్‌ను శ్రీకాకుళంలో నడిపి కోట్లు గడించిన కొందరికి శ్రీను లక్షల్లో బకాయి ఉన్నట్టు తెలుస్తుంది. ఇదిలా ఉండగా, పోలీసుల అదుపులో ఉన్న బుకీలు సొంతంగా ఒక బెట్టింగ్ యాప్ తయారుచేసి, అందులో అమాయకులను దించి వీరు సొంతానికి ఆడిస్తున్నట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారని భోగట్టా.

## ఆ మూడు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలి

(సత్యంన్యూస్, పలాస)

ఈ నెల 20న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, మరో 27 మందిని కేంద్ర సైనిక బలగాలు ఎన్‌కౌంటర్ చేసిన నేపథ్యంలో ఆయా మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అందజేయాలని ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల ప్రతినిధులు డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పు చెప్పినా ఇంతవరకు ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు ఆ మృతదేహాలని కుటుంబ సభ్యులకు అప్పజెప్పలేదని, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం మృతదేహాలను ఆయా కుటుంబ సభ్యులకు అప్పజెప్పిందని, మన రెండు రాష్ట్రాలకు సంబంధించిన మూడు మృతదేహాలను వెంటనే కుటుంబ సభ్యులకు అప్పచెప్పాలని కోరారు. ఈమేరకు నల్ల బ్యాడ్జీలతో బొడ్డపాడులో నిరసన తెలిపారు. అలాగే కగార్ ఆపరేషన్ నిలుపుదల చేసి శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.



కార్మిక హక్కుల కోసం పోరాటాలే కాకుండా కార్మికుడు మరణించిన తర్వాత ఆ కుటుంబాన్ని ఆదుకోవడంలో కూడా సిటు ముందుంటుందని జిల్లా కార్యదర్శి ఎన్‌వీ రమణ అన్నారు. ఇటీవల కాలంలో రెడ్డి సూర్యారావు చనిపోవడంతో ఆయన భార్య బాలకు కార్మికుల నుంచి వసూలు చేసిన 1,07,500 కార్మికుల సమక్షంలో సోమవారం శ్యాంపిస్టన్స్ ప్లాంట్-3 వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.సూర్యనారాయణ ఎల్.నాగరాజు, జె.సురేష్, పి.సంతోష్, ఎస్.శ్రీను, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు

- సత్యంన్యూస్, రణస్థలం




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.